క్లుప్తంగా

107 మందికి వైద్య పరీక్షలు


గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

చీరాల: మండలంలోని తోటవారిపాలెం పోలేరమ్మ దేవస్థానం వద్ద రైట్ హాస్పిటల్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయ్యింది. దేవస్థాన కమిటీ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో హాస్పిటల్ వైద్యులు సాంబశివరావు, నాగూర్‌బాబు, ప్రశాంత్‌లు 107 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, ఆహార నియమాలు, చిన్న వ్యాయామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, శివ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు మెటీరియల్ పంపిణీ


కార్మికులకు మెటీరియల్ అందజేస్తున్న సర్పంచ్

యద్దనపూడి: మండల కేంద్రమైన యద్దనపూడి పంచాయతీ కార్యాలయంలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ వల్లేరు రేణుకా బాలకోటేశ్వరావు మెటీరియల్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా కార్మికులకు యూనిఫాం, మాస్కులు, శానిటైజర్, డెటాల్ సబ్బులు, కొబ్బరినూనె, గ్లౌజులు, బూట్లు, తదితర ఐటమ్స్ ఉన్న కిట్లను కార్మికులకు అందజేశారు కార్యక్రమంలో ఈఓఆర్డీ శ్రీనివాసరావు, వైస్ సర్పంచ్ రావిపాటి శ్రీరామ్‌మూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వార్డుమెంబర్లు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం


దగ్ధమైన పొగాకు బ్యారన్

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని బొడ్డువానిపాలెం గ్రామానికి చెందిన భీమనాథం అంజిరెడ్డి కి చెందిన పొగాకు బ్యార్నీలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అద్దంకి అగ్నిమాపక కేంద్రానికి సమాచారాన్ని అందచేశారు. దీంతో ప్రమాద స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. బాధితుడు తెలిపిన సమాచారం మేరకు బ్యార్నీలో పొగాకు కాలుస్తున్న సమయంలో కర్రలు జారి పడి మంటలు వ్యాపించాయన్నారు. దీంతో లోపల ఉన్న పొగాకు, బ్యారన్‌లోని కలప కాలిపోయిందని రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

కొరిశపాడులో కరోనా కలకలం

మేదరమెట్ల: మండల కేంద్రమైన కొరిశపాడులో ఒకరికి కరోనా లక్షణాలు ఉన్నట్లు వైద్యులు శనివారం నిర్ధారించారు. ఇతను అయప్ప మాల వేసుకొని శబరిమలై వెళ్లి తిరిగి గ్రామానికి వచ్చినట్లు తెలిసింది. ఇతనితో పాటు మరో ఐదుగురికి కూడా కరోనా పరీక్షల కోసం వైద్యశాలకు పంపించామని, రిపోర్టులు ఇంకా రాలేదని తహశీల్దార్ సుశీల తెలిపారు. ఇప్పటికే గ్రామంలో శానిటేషన్‌తో పాటు బ్లీచింగ్ చల్లించామన్నారు. మాస్కులు పెట్టుకొని తిరగాలని ప్రజలకు అవగాహన కల్పించినట్లు తహశీల్దార్ తెలిపారు.

గుండె వ్యాధులపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బాబురావు

పర్చూరు (చినగంజాం): గుండె వ్యాధులు గురించి పెద్దలతో పాటు విద్యార్థులు సైతం అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ ఇస్తర్ల బాబురావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో మండలంలోని నాగులపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు గుండె జబ్బులు, ఇతర వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యం గురించి తగిన జాగ్రత్త పాటిస్తూ వైద్యుల సూచనలు, సలహాలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు ప్రిన్సిపాల్ పీ విశ్వరాణి, క్లబ్ కార్యదర్శి పంబి సదానంద రెడ్డి, సభ్యులు మున్నంగి వెంకట సుబ్బయ్య, కోమటి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా.. ఆడుదాం ఆంధ్రా


నాగండ్లలో క్రికెట్ కిట్ అందజేస్తున్న ఎంపీడీఓ రాజ్యలక్ష్మి


బూదవాడ గ్రామంలో ఆడుదాం ఆంధ్రా ఆడుతున్న బాలికలు


చెన్నుపల్లిలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

జే.పంగులూరు/బల్లికురవ: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా జరుగుతున్న క్రీడా పోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా జరుగుతున్నాయి. గత ఐదు రోజుల నుంచి మండల 14 సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఎంతో రసవతరంగా, ఆరోగ్యకరమైన వాతావరణంలో అధికారులు నిర్వహిస్తున్నారు. క్రీడాకారులు ఎంతో ఉత్సాహ భరితంగా ఆడుతూ వారి ప్రతిభను కనపరుస్తున్నారు. శనివారం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో నోడల్ అధికారులు, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొంటున్నారు.

ప్రభుత్వం ఉల్లాసం ఉత్సాహానికి ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో నువ్వానేనా అన్నట్లు యువతీ యువకులు తలపడుతున్నారని బల్లికురవ ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య అన్నారు. శనివారం చెన్నుపల్లి, గుంటుపల్లి, పెదఅంబడిపూడి, సచివాలయాల పరిధిలో ఖోఖో కబడ్డీ, బాడ్మింటన్ ఆయన పర్యవేక్షించారు. క్రీడలు విద్యలో ఓ భాగమేనని బాల్యదశ నుంచే క్రీడల్లో ప్రతిభ చూపితే అత్యుత్తమ క్రీడాకారులుగా ఎదగవచ్చన్నారు.

ఇంకొల్లు (చినగంజాం): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడమే ఆడుదాం ఆంధ్రా లక్ష్యం అని ఎంపీడీఓ ఆర్ఎం రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని నాగండ్ల గ్రామ పంచాయతీ సచివాలయ పరిధిలో క్రికెట్ పోటీలను సర్పంచ్ కంచుగంటి పద్మావతి ప్రారంభించారు. ప్రభుత్వం అందించిన క్రికెట్ కిట్‌లను ఆమె క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి పాదిలి వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు ప్రభుత్వం రాయితీలు

చీరాల టౌన్: ఉద్యానపంటలు సాగు చేసే రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానశాఖాధికారి అలేఖ్య సూచించారు. శనివారం మండలంలోని కావూరివారిపాలెం గ్రామంలో సాగు చేస్తున్న ఉద్యాన పంటలను ఉద్యానశాఖ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా ఉద్యానశాఖ అధికారి అలేఖ్య మాట్లాడుతూ ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. పూలు, ఆకుకూరలు, కూరగాయలు సాగు చేసే రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తుందన్నారు. ఉద్యాన రైతులకు 40 శాతం సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు, పూల తోటలకు హెక్టారుకు రూ.16000 సబ్సిడీ, ఇతర రాయితీలు అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకుని వద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, ఆర్‌బీకే సిబ్బంది ఉన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న శింగరకొండ ఏసీ సుభద్ర


చీరాలలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు

అద్దంకి రూరల్: అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం శింగరకొండ దేవస్థానం కార్యాలయంలో దేవస్థాన కార్యనిర్వాహక అధికారి తల్లా ప్రగడ సుభద్ర, అద్దంకి సబ్ ట్రెజరీ ఆఫీసర్ కే. లక్ష్మీ ప్రసన్నా, హీరో హోండా షోరూమ్ అధినేత శ్రీప్రియ, దేవస్థాన ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యురాలు కే. రమాదేవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జమ్మలమడుగు హనుమంతరావు, ఈదర శివప్రసాద్, కోశాధికారి నాగరాజు, దేవస్థాన పూజారి వంగల హరిశంకర అవధాని, ధర్మవరపు శ్రావణ్, వామరాజు వెంకటేశ్వర్లు, లక్కరాజు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

చీరాల అర్బన్: యూటీఎఫ్ మండల శాఖ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను శనివారం మండల విద్యాశాఖాధికారి పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆవిష్కరించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.భిక్షాలు బాబు, అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటి సభ్యులు పి.సీతారామరాజు, ఎస్.రవి, ఖాశిం, విశ్వేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ పి.సురేష్, కె.వీరాంజనేయులు నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘంతో గృహోపకరణాలు దగ్ధం

- ఆర్థిక సాయం చేసిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి


బాధితులతో మాట్లాడుతున్న హనిమిరెడ్డి

జే.పంగులూరు: విద్యుదాఘంతో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఈఘటన మండలంలోని పంగులూరు దళిత కాలనీలో బొల్లా వీరాంజినేయులు ఇంట్లో శుక్రవారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు ఇంటిలోని పంచలో టీవి చూసి వీరాంజినేయలు కుటుంబ సభ్యులు అక్కడే మంచం మీద నిద్రపోయారు. శనివారం రాత్రి 2 గంటల సమయంలో కరెంట్ మీటర్ వద్ద విద్యుదాఘతం జరిగి మంటలు చెలరేగాయి. కుటుంబ సభ్యులు నిద్ర మేలుకునే లోపే మంటలు వ్యాపించడంతో 15 బస్తాల బియ్యం, టీవి, మంచాలు, ఫ్యాను, కొన్ని గృహోపకరాలు పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అద్దంకి నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పానెం హనిమిరెడ్డి పంగులూరు వచ్చి బాధితులను పరామర్శించి వారికి ఆర్థిక సాయం అందించారు. ఆయనతో పాటు మండల నాయకుడు స్వయంపు హనుమంతురావు, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, వీరయ్య, మురకుండ వెంకటేశ్వర్లు , నాగేశ్వరావు, ఆంజనేయులు, భాస్కర్‌రాజు,బద్రి, బ్రహ్మరెడ్డి, సురేష్, గాదే సుబ్బారెడ్డి, తల్లపనేని శ్రీనివాసరావు, నాగబోయిన తిరుపతయ్య, బాచిన ఆంజనేయులు, బాచిన వినయ్, రాయిణి శ్రీనివాసరావు, ముప్పనేని శ్రీను, బొల్లా పోలయ్య, శరత్, గుడిపూటి సింగయ్య, కొణతం రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తి గౌరవప్రదమైనది

- ప్రకాశం జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి సోమశేఖర్


కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న జిల్లా న్యాయమూర్తి సోమశేఖర్

చీరాల రూరల్: న్యాయవాద వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని కక్షిదారులకు న్యాయ సహాయమందించడం ఒక్క న్యాయవాదులకే దక్కుతుందని ప్రకాశం జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి ఎంఏ. సోమశేఖర్ అన్నారు. శనివారం చీరాల విచ్చేసిన న్యాయమూర్తి స్థానిక కోర్టు భవన సముదాయములోని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కోర్టుకు సంబంధించిన పలురకాల రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా కోర్టు ప్రాంగణంలోని న్యాయమూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ హాలులో మహాత్మాగాంధీ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు తమ సమస్యలను న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా చీరాల కోర్టుల్లో అధిక మొత్తంలో కేసులు నమోదవుతున్న దృష్ట్యా అదనపు జిల్లా కోర్టు (ఏడీజే) కోర్టుకు అనుమతులు ఇప్పించాలని న్యాయమూర్తికి వివరించారు. అనంతరం న్యాయమూర్తి సోమశేఖర్ మాట్లాడారు. చీరాలలో కోర్టుల్లో అధిక మొత్తంలో కేసులు నమోదవుతున్న విషయం వాస్తవమేనని న్యాయవాదులందరూ ఏకతాటిపై ప్రయత్నిస్తే తప్పకుండా ఏడీజే కోర్టు చీరాలకు వస్తుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం న్యాయమూర్తిని ఘనంగా సత్కరించారు. ఐఏఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డైరీలు, క్యాలండర్లను న్యాయమూర్తుల చేతులు మీదుగా ఆవిష్కరింపచేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక న్యాయమూర్తులు షేక్ రెహానా, షేక్ నిషాద్‌నాజ్, న్యాయవాదులు కరేటి రవికుమార్‌రెడ్డి, టీజే సాయిబాబు, శ్రీకాంత్ ఠాకూర్, సీహెచ్. మస్తాన్‌రావు, సభ్యులు ఎన్. రాము, ఎం. రవికుమార్, ఎస్కే సిరాజ్, మణినాగశయన న్యాయవాదులు పాల్గొన్నారు.

జనవరి 13 నుంచి ఎడ్ల బల ప్రదర్శనలు

పర్చూరు (చినగంజాం): మండలంలోని అన్నంబొట్లవారిపాలెంలో జనవరి 13 నుంచి గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ 36వ జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గోరంట్ల భాస్కర రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ ఉభయ రాష్ట్రాల స్థాయిలో పొట్టేలు పందేలు, 16,17 తేదీల్లో గుర్రపు పందేలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 13 నుంచి 19 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, రైతు సోదరులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు.

వాసవీ క్లబ్‌కు ఉత్తమ అవార్డులు


ఉత్తమ ప్రోగ్రాం అవార్డు అందుకుంటున్న బాలకృష్ణ

వేటపాలెం: వేటపాలం వాసవీ క్లబ్‌కు చెందిన ఇద్దరు ఉత్తమ అవార్డులు అందుకున్నారు. విజయవాడలోని ఏ1 పంక్షన్ హాల్లో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ 2023 సంవత్సరానికి విజయభేరి అవార్డులను శనివారం అందజేశారు. వేటపాలెం వాసవీ క్లబ్ ఇంటర్‌నేషల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా దోగిపర్తి బాలకృష్ణ బెస్ట్ ప్రోగ్రాం అవార్డు అందుకున్నారు. ఉత్తమ జిల్లా ఇన్‌చార్జిగా చుండూరి సురేష్ అవార్డు అందుకున్నారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి వీరికి అవార్డులు అందజేశారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

చినగంజాం: జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓవ్యక్తికి గాయాలయ్యాయి. ఈఘటన శనివారం రాత్రి చినగంజాం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. 108 సిబ్బంది ఈఏంటి ఎం రాఘవరెడ్డి, పైలట్ భాగ్యరావు అందించిన సమాచారం ప్రకారం నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన ఎం ఆంజనేయులు బైక్‌పై ఉప్పుగుండూరుకు బయలుదేరాడు. జాతీయ రహదారిపై చినగంజాం బస్టాప్ రహదారి వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆంజనేయులు గాయాలపాలయ్యాడు. సమాచారం అందడంతో ఘటనా స్థలానికి వెళ్లి చికిత్స నిమిత్తం ఒంగోలు ఆసుపత్రికి తరలించారు.

పోలీసులు ప్రజల మన్ననలు పొందాలి


యద్దనపూడి స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశులు

యద్దనపూడి/మార్టూరు: పోలీసులను ఆశ్రయించిన బాధితులకు న్యాయం చేసి ప్రజల మన్ననలు పొందాలని బాపట్ల డీఎస్పీ వెంకటేశులు సిబ్బందికి సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం మార్టూరు, యద్దనపూడి పోలీస్‌స్టేషన్లను ఆయన పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో గౌరవంగా మెలగాలని, వారి సమస్యలను ఓపికగా వినాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన బాధితులకు న్యాయం జరగకపోతే పోలీసు వ్యవస్థపై నమ్మకం పోతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నమోదైన నేరాలు , వాటి విచారణ , ఏ కేసులు ఏ కోర్టుల పరిధిలో ట్రయల్ జరుగుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా డ్రంకన్ డ్రైవ్, ఓవర్ లోడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తదితర ఉల్లంఘనపై నమోదైన కేసులను సమీక్షించారు. కార్యక్రమంలో మార్టూరు సీఐ అక్కేశ్వరరావు, ఇంకొల్లు సీఐ బత్తుల శ్రీనివాసరావు ఎస్సై నాగశ్రీను, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నాగిరెడ్డికి జాతీయ పురస్కారం


పురస్కారంతో నాగిరెడ్డిని అభినందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

కారంచేడు: మండలంలోని యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన మదర్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు మున్నంగి నాగిరెడ్డికి జాతీయస్థాయి ఉత్తమ సేవా పురస్కారం వరించింది. శనివారం అనంతపురం జిల్లా రాయదుర్గం వాసవీ కల్యాణ మండపంలో స్థానిక 'వీ' ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎం విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన పురస్కారం అందుకున్నారు. చీరాల, కారంచేడు, బాపట్ల, పర్చూరు ప్రాంతాల్లో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక సేవా కార్యక్రమాలను గుర్తించి నాగిరెడ్డిని పురస్కారానికి ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు. ఏపీ, తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సుమారు 50 సేవా సొసైటీలను గుర్తించి వారికి ఈ పురస్కారాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిటీ సురేష్ బాబు, చేంజ్ ఫర్ సొసైటీ అధ్యక్షుడు ఆర్‌వి రాజు, శిద్దేశ్వరరావు, కొండలరావు, వివిధ సొసైటీల అధ్యక్షులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో రికార్డులు సక్రమంగా ఉండాలి


బల్లికురవలో మాట్లాడుతున్న పీడీ అర్జున్‌రావు

బల్లికురవ: ప్రభుత్వం గ్రామాల్లోని కూలీలకు పనులు కల్పించేందుకు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంలో పనులు నాణ్యతా ప్రమాణాలతో రికార్డులు సక్రమంగా ఉండాలని బాపట్ల జిల్లా డ్వామా పీడీ బీ. అర్జున్‌రావు హెచ్చరించారు. శనివారం స్థానిక కార్యాలయం వద్ద 2022–23 సంవత్సరానికి జరిగిన పనులకు బహిరంగ ప్రజావేదికలో పీడీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 21 గ్రామ పంచాయతీల్లో కూలీలు, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి 1199 పనులకు రూ.9.77 కోట్లు నిధులు ఖర్చు చేశారు. ఈ పనులకు సంబంధించి ఈనెల 14 నుంచి 29 వరకు ఎస్ఆర్‌పీ విజయభాస్కర్ పర్యవేక్షణలో డీఆర్‌పీలు బృందాలుగా ఏర్పడి గ్రామాల వారీగా తనిఖీలతో గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాల వారీగా జరిగిన పనులను బహిరంగ ప్రజావేదికలో డీఆర్‌పీలు వివరించారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ పనులకు సంబంధించి రికార్డులు సంక్రమంగా లేకపోయినా, అవకతవకలకు పాల్పడినా సంబంధిత గ్రామ పంచాయతీ ఫీల్ట్ అసిస్టెంట్ టెక్నికల్ అసిస్టెంట్ నుంచి రికవరిలు చేస్తామని అర్జున్‌రావు వివరించారు. ప్రజావేదికలో డీవీవో శోభన్, ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య, ఏపీవో బాలకృష్ణనాయక్, పీఆర్ గృహనిర్మాణ సంస్థ ఏఈలో జీ. హనుమంతరావు, దుర్గారమేష్, ఎంపీటీసీ రాహేలు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల కబడ్డీ విజేత ప్రకాశం


విజేతలకు బహుమతి అందజేస్తున్న నరసింహారెడ్డి

జే.పంగులూరు: ఉభయ తెలుగు రాష్ట్రాల కబడ్డీ విజేతగా ప్రకాశం జట్టు నిలిచింది. మండల పరిధిలోని కొండమంజులూరు గ్రామంలో క్రిస్మస్, నూతన సంవత్సర సందర్భంగా గత మూడు రోజుల నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలు జరుగుతున్నాయి. చివరి రోజు శనివారం ఉత్కంఠ భరితంగా జరిగిన పోటీల్లో ప్రకాశం జట్టు మొదటిస్థానం సాధించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ నాయకుడు, అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పానెం హనిమిరెడ్డి సోదరుడు నరసింహారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి క్రిడలకు ఎంతో ప్రోత్సహం అదింస్తున్నట్లు తెలిపారు. విజేత ప్రకాశం జట్టుకు రూ. 50116, షీల్డ్‌ను హనిమిరెడ్డి అందించారు. రెండో స్థానం సాధించిన సై క్లబ్ విజయవాడ జట్టుకు రూ. 40116, షీల్డ్‌ను వైఎస్సార్ సీపీ మండల నాయకుడు స్వయంపు హనుమంతురావు, మూడో స్థానం సాధించిన సామర్లకోట జట్టుకు రూ. 30116, షీల్డ్‌ను మాజీ ఏఎంసీ చైర్మన్ జంపాని రవిబాబు, నాలుగో స్థానం సాధించిన చినగంజాం జట్టుకు రూ. 20116, షీల్డ్‌ను మండల నాయకుడు భీమనాథం అంజిరెడ్డి, ఐదో స్థానం సాధించిన కేఎల్ యూనివర్సిటీ జట్టుకు రూ. 10116, షీల్డ్‌ను రేణింగవరం సర్పంచ్ భూమా హరిప్రసాద్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు జంపాని రవి, పులికం కోటిరెడ్డి మండల నాయకుడు స్వయంపు హనుమంతురావు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షతల ఊరేగింపు


చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

యద్దనపూడి: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ పూజ అక్షతలు, పవిత్ర కలశాల శోభయాత్ర శనివారం వేకువజామున మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి అక్షతలను, కలశాలను గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో రామాలయ తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు, అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని మోసం చేసిన కేంద్ర ప్రభుత్వం


మాట్లాడుతున్న మాజీ మంత్రి జేడీ శీలం

చినగంజాం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలా మోసం చేసిందని మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. శనివారం పర్చూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీపై రాష్ట్ర ప్రజలకు పీకల దాకా కోపం ఉందని, రాజధానికి, పోలవరానికి నిధులు ఇస్తానని మోసం చేసిందని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయడం బీజేపీ అసమర్థత కాదా అని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. వచ్చే నెల నుంచి గ్రామాల్లో పర్యటన చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాష్, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివనాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు అంజిబాబు నాయకులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో డేటా ఎంట్రీ ఆపరేటర్, టైలరింగ్, హెల్పర్ ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో పదో తరగతి, ఆపైన చదివిన నిరుద్యోగ యువతీ యువకులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

తెలుగు మహాసభలు విజయవంతం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చీరాల డిప్యూటీ డీఈవో శ్రీనివాసులు

పర్చూరు (చినగంజాం): 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు 2024 జనవరి 5,6,7 తేదీలలో తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జరుగుతాయని, వాటిని విజయవంతం చేయాలని చీరాల ఉప విద్యాశాఖాధికారి ఆర్ శ్రీనివాసులు అన్నారు. శనివారం వైఆర్ హైస్కూల్ నందు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తెలుగు మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. బాపట్ల జిల్లా ఉత్సవ కమిటీ సంచాలకులు పిడవర్తి పేరిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగు మహాసభల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వైఆర్ హైస్కూల్ హెచ్‌ఎం ఈదర రాజశేఖర్, ఉప్పుటూరు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం జీ వసుంధర, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.